నిర్వహణపై నిర్లక్ష్యం

- తూతూ మంత్రంగా ఓవర్‌హెడ్ ట్యాంకుల పర్యవేక్షణ
- నీటి స్వచ్ఛతకు విఘాతం



ఓహెచ్‌టీ పైకప్పు ఇలా..



శిథిలావస్థలో ఉన్న ఓహెచ్‌టీ

గాజువాక : జీవీఎంసీ నీటి సరఫరాకు సంబంధించిన ఓవర్ హెడ్ ట్యాంకు (ఓహెచ్‌టీ)ల నిర్వహణపై నిర్లక్ష్యం చోటు చేసుకుంది. లక్షల మందికి నీటిని సరఫరా చేసే ట్యాంకులకు భద్రత కల్పించడంలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఫలితంగా ఏ ట్యాంకులో ఏది పడిపోతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. తాగునీటికి రక్షణ లేని పరిస్థితుల్లో గాజువాక ప్రాంత ప్రజలు భారం దేవుడిపై వేయాల్సి వస్తోంది. 20 వార్డులతో విస్తరించి ఉన్న గాజువాక జోన్‌లో నీటి సరఫరా కోసం గోదావరి, కేబీఆర్, మేఘాద్రిగెడ్డ, సిద్ధార్థనగర్, అగనంపూడి ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టుల నుంచి ప్రతిరోజు సుమారు 15 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తారు. కొండవాలు ప్రాంతాలు, ఈ ప్రాజెక్టులకు దూరంగా ఉన్న కాలనీలకు తాగునీటిని సరఫరా చేయడం కోసం ఓవర్ హెడ్ ట్యాంకులను ఉపయోగిస్తారు. ఈ మొత్తం ప్రాజెక్టులపై సుమారు 26 ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి. వాటి నిర్వహణ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో తమ ఇంట్లో నీరు బాగులేదని కొందరు, దుర్వాసన వస్తోందని మరికొందరు జోనల్ అధికారులకు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారు.

నీటి శుభ్రత నిజమేనా?

ఈ ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీటి శుభ్రత విషయంలో విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాంకుల వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతో అనధికార వ్యక్తులు ఓహెచ్‌టీలపై ఎక్కి మద్యం సేవించడం, పేకాట ఆడటం వంటి సంఘటనలు గతంలో అనేకసార్లు వెలుగు చూసిన విషయం తెలిసిందే. కరోనాకు ముందు వడ్లపూడి ఓహెచ్‌టీలో ఒక వ్యక్తి అందులో పడి మృత్యువాత పడ్డాడు. దీంతో ఆ ట్యాంక్ నుంచి సరఫరా అయిన నీటిని జనం తాగడానికి చాలాకాలం ఇష్టపడలేదు. ఆ తర్వాత మెల్లగా పరిస్థితి సద్దుమణిగింది. తాజాగా డ్రైవర్స్ కాలనీలోని ఓహెచ్‌టీలో ఒక కుక్క పడి మృతి చెందిన విషయం తెలిసిందే. దీన్ని గుర్తించే సరికే నీరు ఇళ్లకు చేరిపోయింది. ఆ నీరు వాడకుండా ప్రజలను అప్రమత్తం చేయడానికి సిబ్బంది నానా యాతన పడాల్సి వచ్చింది. ఇలాంటివి ఇంకా అనేక సంఘటనలు చోటు చేసుకున్న దాఖలాలున్నాయి. ఓహెచ్‌టీల వద్ద కనీసం ప్రహరీ నిర్మించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోవడంలేదు.

శిథిలావస్థలో ఓహెచ్‌టీలు

పలు ఓహెచ్‌టీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గాజువాక మున్సిపాలిటీగా ఉన్న సమయంలో నిర్మించిన సుమారు ఆరు ఓహెచ్‌టీలను సిబ్బంది భయం భయంగానే ఉపయోగిస్తున్నారు. సిద్ధేశ్వరంలో రెండు ఓహెచ్‌టీలు, డ్రైవర్స్ కాలనీలో ఒకటి, శ్రీనగర్, టీజీఆర్ నగర్‌లో ఒక్కొక్క ఓహెచ్‌టీలు మరమ్మతుకు చేరుకున్నాయి. ట్యాంకుల పైకప్పుల నుంచి శిథిలాలు ఊడి నీటిలో పడిపోతున్నాయి. మరోపక్క వాటి నిర్వహణ విషయంలో నిర్దిష్ట సమయమంటూ ఉండటంలేదు. నిర్వహణకు సంబంధించిన చార్టులను కూడా సిబ్బంది అందుబాటులో ఉంచుకోలేని పరిస్థితి కనిపిస్తోంది.



ఓహెచ్‌టీలో పడిపోయిన కుక్క (ఫైల్)

అధికారులకు అదనపు బాధ్యతలు

నీటి సరఫరాను పర్యవేక్షించాల్సిన సహాయ ఇంజినీర్లకు అదనపు బాధ్యతలు ఉండటంతో వారి సేవలు సమర్థవంతంగా అందడంలేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం గోదావరి 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న సహాయ ఇంజనీరు సిద్ధార్థనగర్ ప్రాజెక్టు, అనకాపల్లి నీటి సరఫరాను కూడా పర్యవేక్షిస్తున్నారు. అగనంపూడి వాటర్ ప్రాజెక్టు ఏఈ తన బాధ్యతలతో పాటు అదనంగా జీవీఎంసీ ప్రాజెక్టు విభాగంలో కూడా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నగరంలోనే పెద్ద జోన్‌గా ఉన్న గాజువాకలోని నీటి ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రాంతాల్లోని విభాగాల్లో కూడా పని చేస్తుండటంతో సంబంధిత ఏఈలు తమ సేవలను పూర్తిస్థాయిలో ఇక్కడ అందించలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ ఇమ్రాన్ తదితరులు

గాజువాక : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా బాధ్యతను తీసుకోవాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సూచించారు. 66వ వార్డులోని బీసీ రోడ్-2 సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకరమైన చెత్తను వేర్వేరుగా విభజించి ఇంటింటికీ వచ్చే ప్రజారోగ్య సిబ్బందికి అందించాలన్నారు. వారానికి ఒకరోజు నీటి నిల్వలు లేకుండా, పాత్రల్ని ఆరబెట్టుకోవాలన్నారు. కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని, గుడ్డ సంచులను వాడాలని కోరారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డులో చక్కటి పనితీరు కనబరచిన సచివాలయ శానిటరీ కార్యదర్శిని సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, స్థానిక నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ఏరియా ఆస్పత్రికి ప్రశంసలు

అగనంపూడి : దివ్యాంగులకు సేవలు, సదరం క్యాంప్‌ల నిర్వహణ, ధ్రువపత్రాల జారీలో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చింది. గురువారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉన్నతాధికారులు ఆస్పత్రి సిబ్బందిని, ముఖ్యంగా ఆర్థోపెడిక్ విభాగాన్ని ప్రశంసించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష శుక్రవారం తెలిపారు. ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ కృష్ణమూర్తి సారథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు 60 నుంచి 80 మందికి వైద్య సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తమ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలకుగాను పలుమార్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

విశాఖలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం విశాఖలో పర్యటించారు. డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి, వివిధ విషయాలపై వారి నుంచి సూచనలు సలహాలు తీసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. ఈ పనులపై గతిశక్తి ప్రాజెక్టు అధికారులతో కలిసి సమీక్షించారు. సెల్ఫ్ ప్రొపైల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్‌లో జీఎం మనోజ్ శర్మ మార్షలింగ్ యార్డ్, కోచింగ్ యార్డ్, గోపాలపట్నం యార్డ్, సింహాచలం నార్త్ యార్డ్ వంటి కీలక ప్రాంతాలను పర్యటించారు. అనంతరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను పరీక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌తో సమావేశమై పలు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. అదాని గంగవరం పోర్టు అధికారులతో జీఎం సమావేశమయ్యారు. చివరిగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరగుతున్న పనులను జీఎం పరిశీలించారు. పర్యటనలో పలువురు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీకి చెందిన పైల రాజులమ్మ(48) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో శనివారం ఆమె కుటుంబ సభ్యులకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందించారు. మిగిలిన రూ.90 వేలు కుటుంబ సభ్యుల ఖాతాలో జమఅవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ రాజాబాబు , నాయకులు పెంట్ల బాలకృష్ణ, సేనాపతి తాతబాబు, గుండపు అశోక్, అన్నెపు సూర్యనారాయణ, గరుగుబిల్లి బైరాగి, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రై డేపై విద్యార్థులకు అవగాహన



డ్రై డేపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని యాంటీ మలేరియా సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో సిబ్బంది మాట్లాడుతూ వారంలో ఒక్క రోజు డ్రై డే పాటించడం వల్ల దోమల వ్యాప్తికి దూరంగా ఉంటామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని అన్నారు. తద్వారా మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులకు చెక్ పెట్టవచ్చన్నారు. విద్యార్థులు వారివారి తల్లిదండ్రులకు డ్రై డేపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో యాంటి మలేరియా సిబ్బంది కొత్తర అప్పలరాజు, మురళీకృష్ణ, సచివాలయ ఏఎన్‌ఎంలు, శానిటేషన్ ఉద్యోగులు, పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి

కూర్మన్నపాలెం : దువ్వాడ ఆర్చి వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు బీమా రావాలంటే ఖచ్చితంగా అన్ని రకాల డాక్యుమెంట్లు ఉండాలన్నారు. నేరాలు అదుపు చేయాలంటే డ్రైవర్లు తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు. రెండు, మూడు ఆటోలకు ఒకే నంబరు అంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ అప్పారావు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజామోదం లేని నిర్ణయం పనికిరాదు’



834వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికి పెరిగిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 834వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు జరగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రజామోదం లేదనేందుకు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే నిదర్శనమని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్న చూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికీ దీన స్థితిలో ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని విరమించుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 పద్మజ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార, అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు అందాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 81878 97569కు తెలిపి వివరాలు(సమస్య, డోరు నంబర్, వార్డు, ఏరియా) వాట్సాప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా అధికారులకు నివేదించి, ఆ సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జోన్-2 నుంచి 1, జోన్-3 నుంచి 2, జోన్-4 నుంచి 1, జోన్-5 నుంచి 2, జోన్-6 నుంచి 1, జోన్-7 నుంచి 1, జోన్-8 నుంచి ఒక ఫిర్యా దు వచ్చింది. సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీ-1 కె. పద్మజ స్పందన నిర్వహించారు. సిటీ ప్లానర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ గాజువాక కన్వీనర్ నరసింగరావు

అక్కిరెడ్డిపాలెం : ఈ నెల 28న ప్రధాని మోదీ మన్ కీ బాత్-101 కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పిలుపునిచ్చారు. మ భెల్(హెచ్‌పీవీపీ) టౌన్ షిప్ అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం పార్టీ నాతయ్యపాలెం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారంలో విశాఖ ప్రజలతో మాట్లాడనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా, గౌరవ అధ్యక్షుడి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. పాల్గొననున్నారన్నారు. సమావేశంలో స్థానిక బీజేపీ నాయకులు బోడాల శ్రీనివాసరావు, ఇందల అప్పారావు, బొండా బాబూరావు, కర్రి శ్రీను, గూడూరు శంకరరావు, నాగేశ్వరరావు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వి రాజక్‌ను అభినందించిన కలెక్టర్



పూర్వి రాజక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : విశాఖకు చెందిన పూర్వి రాజక్(12)ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ టాలెంటెడ్ కిడ్-2023గా ప్రకటించింది. దీంతో శుక్రవారం పూర్వి రాజక్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ ఆమెను అభినందించారు. పూర్వి రాజక్ కళ, సాహిత్యం క్రీడా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. ఆమె మూడేళ్ల వయసులోనే తొలి అవార్డు గెలుచుకుంది. అనంతరం మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా అనేక అవార్డులు పొందింది. ఆర్ట్, కరాటే, ఎలక్ట్రికల్ రంగాల్లో 300 కంటే ఎక్కువ అవార్డులు, పురస్కారాలు గెలుచుకుంది. ఈమె పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2022లో నమోదు చేసింది. రచయిత్రి, కళాకారిణి, వక్త, కరాటే నిపుణురాలు, సామాజిక కార్యకర్తగా బంగారు పతక విజేతగా నిలిచింది.

త్వరితగతిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు

- అధికారులకు ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు ఆదేశం

ఆనందపురం : నిర్మాణ పనులు పూర్తి అయిన టిడ్కో ఇళ్లకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని దబ్బందలో టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దబ్బందలో 1920 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించగా, 1728 ఇళ్ల పనులు పూర్తయినట్టు వెల్లడించారు. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన బ్లాకుల వద్ద బీటీ రోడ్లు, కాలువలు, వంతెనలు, విద్యుత్, డ్రైనేజిలతో పాటు ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులను పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణ సదుపాయాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించేఅవకాశాలున్నాయని, పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అమలవుతోన్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. వెల్లంకిలో అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను, గుడిలోవలో భూ రీసర్వేను, లొడగలవానిపాలెంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, డీపీవో చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగన్‌దే గెలుపు

- గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి



ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఫార్మాసిటీ నిర్వాసితులు

అగనంపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్‌ను గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. మేజర్ సన్స్‌కు పట్టాల సమస్యను ఆరు మాసాల్లో పరిష్కరించిన ఎమ్మెల్యే నాగిరెడ్డిని, పార్టీ నాయకుడు దేవన్‌రెడ్డిని జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కృషి ఫలితంగా గాజువాక నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న నాలుగు సమస్యలు తీరిపోయాయన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది నిరుపేదలకు పట్టాలిచ్చామన్నారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, ఎర్ని రమణారావు, కొలిమల్ల హరిరామకృష్ణ, ఇల్లపు వాసు, ఎర్ని రాజు, గొల్లవిల్లి పైడిరాజు, సిమ్మిటి శ్రీను, గొల్లవిల్లి రామకృష్ణ, ఎండీ రాజు, పాగిరి సతీష్, చొప్పా భాస్కర్, చందక రాజు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- ఎమ్మెల్యేగా నాలుగేళ్లయిన సందర్భంగా నాగిరెడ్డికి ఘన సన్మానం



గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సన్మానిస్తున్న నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు

పెదగంట్యాడ : గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని బీసీ రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి, ఎమ్మెల్యేగా తిప్పల నాగిరెడ్డి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఉన్న అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. వార్డుకు రూ.5 కోట్లు చొప్పున ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఎప్పటి నుంచో పరిష్కారం కానీ హౌస్ కమిటీ సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించినట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజాన రామారావు, ఉరుకూటి చందు, గంగులూరి రోజారాణి, వై.మస్తానప్ప, ధర్మాల శ్రీనివాసరెడ్డి, ఎన్నేటి రమణ, గొందేశి రమణారెడ్డి, మంత్రి శంకర్ నారాయణ, సంపంగి ఈశ్వరరావు, నక్కా వెంకటరమణ, పిట్టా రెడ్డి, ములకలపల్లి వెంకటేష్, గేదెల మధుసూదన్ రెడ్డి, వాసవల్ రెడ్డి, గురుసు రామలక్ష్మి, జ్యోతిలక్ష్మి, పువ్వుల శ్రీను, లోకనాథం, గణేష్, మాటూరు శ్రీనివాసరావు, కొలుగూరు మంగరాజు, మద్దెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 88వ వార్డు యాదవజగ్గరాజుపేటలో భూములు కోల్పోయిన ఏపీఐఐసీ నిర్వాసితుల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతూ శుక్రవారం ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఎమ్మెల్యే కృషి వల్ల ఎమ్మార్వో ఆఫీస్ నుండి అవార్డు కాపీల వెరిఫికేషన్ ప్రారంభమైందని, పేర్లు లేని నిర్వాసితులు కొంతమంది ఉన్నారని, ఇచ్చిన పేర్లు కూడా తప్పుగా ఉండడంతో నిర్వాసితులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు నిర్వాసితుల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. భూములు కోల్పోయిన వారి అవార్డు కాపీలు తెప్పించి, పరిశీలన చేసి వీలైనంత త్వరగా భూసమస్యను పరిష్కరించాలని విన్నవించారు. నమ్మి శ్రీనివాస్‌ప్రసాద్, మాడిస అప్పలరాజు పాల్గొన్నారు.

పాత్ వే ప్రారంభం



సీసీ ఫ్లోరింగ్ (పాత్ వే)ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ : పెదగంట్యాడలోని పెంటమాంబ ఆలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ ఫ్లోరింగ్ (పాత్ వే)ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేతో గ్రౌండ్‌కు తూర్పువైపున ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టాలని కోరగా త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నెల్లిముక్కు సదనపట్టు స్టేజీని సుమారు రూ.60 లక్షల వ్యయంతో మల్టీపర్పస్‌గా రెండు అంతస్తుల్లో నిర్మించేందుకు ఎంపీ నిధులను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సదనపట్టు స్టేజీ నిర్మాణానికి, రామాలయం వద్ద స్టేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించడంలో, బ్లూప్రింట్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జ్ తిప్పల దేవన్ రెడ్డికి ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అందిస్తున్న సహాయ సహకారాలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పెద్దలు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, దొడ్డి పెద్దలు, కమిటీ సభ్యులు, వివిధ సంఘాల పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా యేసురాజు పండగ ప్రారంభం



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్ వెస్లీ

గాజువాక : ఆటోనగర్ వాల్‌మార్ట్ ఎదురుగా ఉన్న మైదానంలో క్రిస్టియన్ లైఫ్ సెంటర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏసు రాజు పండగలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఈ పండగల్లో క్రైస్తవ ఆధ్యాత్మిక ప్రార్థనలు జరుగుతాయి. ఈ కూటమికి మొదటి రోజు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభాధ్యక్షులు, ముఖ్య ప్రసంగీకులు, సీఎల్‌సీ మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుధీర్‌కుమార్ రాష్ట్రంలో కుష్టురోగులు, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, వితంతువులకు చేస్తున్న సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంఘ కాపరులకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్నారని అన్నారు. జెరూసలేం వెళ్లే యాత్రికులకు రూ.60 వేలు రాయితీ అందజేస్తున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవులంతా అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి క్రైస్తవులంతా ఏకమవ్వాలన్నారు. ముందుగా ఆల్ఫ్రెడ్ మహంతి ఆర్కెస్ట్రా ద్వారా ఆలపించిన క్రైస్తవ గీతాలు అలరించాయి. జాన్‌వెస్లీని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెర్సీ మహంతి, క్రైస్తవ పెద్దలు, నాయకులు, క్రైస్తవ కుటుంబాలు పాల్గొన్నాయి.